క్లుప్తంగా

ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోండి



తెనాలిఅర్బన్: ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని, వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని మైత్రి హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ కృష్ణ సందీప్, శ్రీ చక్ర హాస్పిటల్ ఎండీ డాక్టర్ కె.హరీష్ పేర్కొన్నారు. మారీసుపేటలోని సెయింట్ పాల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ వార్షికోత్సవ వేడుకలను కొత్త పేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విజయవాణి స్కూల్ డైరెక్టర్స్ బి.ప్రసాద్, జ్యోతి, సెయింట్ పాల్స్ స్కూల్ వ్యవస్థాపకుడు ఎండీ చావాలి, డైరెక్టర్లు చావాలి అకుల్ నాథ్, చావాలి తేజ్‌నాథ్ పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం




మున్నంగి(కొల్లిపర): మున్నంగి గ్రామంలో ఇటీవల ప్రమాదంలో గాయపడిన జూపల్లి కిషోర్‌కి ఆదివారం అదే గ్రామానికి చెందిన మునికోటిపురం సోషల్ వెల్ఫేర్ సొసైటీ నుంచి రూ.25వేలు అధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి, సెక్రటరీ వేమూరి కిషోర్ బాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అందజేశారు. తన తరఫున కూడా మరో రూ.5వేలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి దీనమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, ఎంపీటీసీ చోడగిరి రామయ్య, ట్రెజరర్ పి.రమ్య, జి.సౌమ్య, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులు, కూలీలు నష్టపోతున్నారు

వల్లభాపురం(కొల్లిపర): కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు, రైతు కూలీలు తీవ్రంగా నష్టపోతురని, సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. ఆదివారం మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ విధానాల వల్ల రైతులు నష్టపోతున్నారని వివరిస్తూ..కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముద్దన సాంబశివరావు, ఆరగ బోసురెడ్డి పాల్గొన్నారు.

మాక్ టెస్ట్‌కు విశేష స్పందన



తెనాలిఅర్బన్: జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పాలిసెట్, ఎంసెట్ మాక్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. విద్యార్థులు అధిక సంఖ్యలో పరీక్షకు హాజరయ్యారు. అనంతరం కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జెట్టి విజయశేఖర్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రకాశం రోడ్డులోని కోచింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ ఉమాదేవి, కోటి, శివ, ఎబినైజర్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల్లో రెండోరోజు పూజలు

తెనాలిటౌన్: కాశీలో జరుగుతున్న గంగానది పుష్కరాల్లో భాగంగా సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో బాల స్వామిజీ స్వీయ పర్యవేక్షణలో రెండో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పుష్కర గంగ స్నానం, మహాశివునికి అభిషేకాలు, అర్చనలు జరిపారు. బాలస్వామిజీ పుష్కర విశిష్టతను భక్తులకు వివరించారు. పట్టణానికి చెందిన శ్రీనివాస్ కల్యాణం భక్తులు కోలాటంతో భక్తి పాటలు నిర్వహించారు.

పుస్తక పఠనం అలవర్చుకోండి



తెనాలిఅర్బన్: పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ రమాదేవి సూచించారు. ప్రపంచ పుస్తక మహోత్సవాన్ని స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా నేటి నుంచి ధాన్యం కొనుగోలు

కర్లపాలెం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కర్లపాలెం ఏఓ సుమంత్ కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. బీపీటీ- 5204 రకం ధాన్యం తప్ప మిగతా ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటా రూ.2,060లకు సాధారణ రకం ధాన్యం రూ.2,040లకు కొనుగోలు చేస్తామని చెప్పారు. పంట నమోదు చేయించుకున్న రైతుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ఏవో చెప్పారు. మిగిలి ఉన్న ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏవో కోరారు.

అంబేడ్కర్ భావజాలంతో యువత పురోగమించాలి

అంబేడ్కర్ కాంస్య విగ్రహ ప్రతిష్ఠ భూమి పూజలో ఎమ్మెల్యే శివకుమార్



భూమి పూజలో ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నేటి యువతరం ముందుకు సాగాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. పట్టణంలోని చినరావూరు తోట మదర్ థెరిస్సా నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న తొమ్మిది అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ భూమి పూజలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగ విలువలను అందరూ పాటించాలన్నారు. అంబేడ్కర్ భావజాలాన్ని, ఆయన సూక్తులను పాటిస్తూ యువతరం పురోగమించాలని పేర్కొన్నారు. తెనాలిలో తొమ్మిది అడుగుల భారీ కాంస్య విగ్రహం ముదావహమన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, త్వరలోనే విగ్రహావిష్కరణ చేయాలని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు రాజ్యాంగం రచించిన అంబేడ్కర్ మహనీయులన్నారు. వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు కుర్రా సుజాత, కొర్రా యశోద, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్ మాట్లాడారు. 14వ వార్డు కౌన్సిలరు దాసరి వీరవసంతరావు మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కన్నెగంటి రమేష్, గొల్ల మాణిక్యరావు, పీసీహెచ్ వెంకయ్య, పెనుమాక మోహన్‌రావు, కర్ర రాజారత్నం, బోరుగడ్డ సురేష్, దాసరి శ్రీధర్, ఉన్నవ సల్మాన్, కన్నెగంటి తేజ, దమ్ము స్టాలిన్, మురారి థామస్, ప్రకాష్, అంబేడ్కర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు దుర్గాప్రసాద్ కాంస్య విగ్రహావిష్కరణ



నాగళ్ల వేంకట దుర్గాప్రసాద్ (ఫైల్)

తెనాలి: పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడిగా, ప్రజ్వలత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడిగా రెండు దశాబ్దాలకు పైగా కళా, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో విశిష్ట సేవలందించిన కళాబంధు నాగళ్ల వేంకట దుర్గాప్రసాద్ ఏడడుగుల కాంస్య విగ్రహాన్ని సోమవారం తెనాలిలో ఆవిష్కరించనున్నారు. కరోనాతో 2021 జనవరిలో మృత్యువాత పడిన.. దుర్గాప్రసాద్ జయంతి రోజునే విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జయంతి సభ నిర్వహిస్తారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, కేఎస్ లక్ష్మణరావుతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహిత్య, కళారంగ ప్రముఖులు హాజరుకానున్నారు.చిలుమూరులోని 'శ్రీరామా' వ్యవస్థాపకుడు కొలసాని వెంకటసుబ్బయ్య మనుమడు దుర్గాప్రసాద్ తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడిగా రెండుసార్లు ఎన్నికయ్యారు. తెలుగు సదస్సు, సాహిత్య సదస్సులు చేపట్టారు. పట్టణ బీసీ కాలనీలో రంగస్థల కళాకారుల సంఘ భవనాన్ని తన హయాంలో నిర్మించారు. ఆంధ్ర నాటక కళాపరిషత్ ఉత్సవాలు నిర్వహించారు. ప్రత్యేకించి తెనాలి యువత కోసం రంగస్థల నటనపై రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. అనంతరం ప్రజ్వలిత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడిగా విభిన్న కళా, సాంస్కృతిక, సాహిత్య సదస్సులను చేపట్టారు.

వీడీఆర్ మనోహర్ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

తెనాలి అర్బన్: జిల్లా పరిషత్ విశ్రాంత అసిస్టెంట్ సీఈఓ, వాకర్స్ క్లబ్ తెనాలి-2 వ్యవస్థాపకుడు వీడీఆర్ మనోహర్ సంస్మరణ సభను సుల్తానాబాద్‌లోని రత్నా ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కుటుంబ సభ్యులు, పట్టణ ప్రముఖులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేజండ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా పరిషత్ మేనేజర్‌గా, కర్నూలు జెడ్పీ అసిస్టెంట్ సీఈవోగా మనోహర్ సేవలు మరువరానివన్నారు. అలాగే వాకర్స్ క్లబ్ తెనాలి-2ను ఏర్పాటు చేసి పురపాలక సంఘం పాఠశాలలో చదివే విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం చేసేవారని గుర్తుచేశారు. కుటుంబ సభ్యులు వీరమాసునేని శ్రీనివాస్, భుజగరావు, బుచ్చిబాబు, భాస్కరరావు, సూరిబాబు, వీరమాసునేని వెంకటేశ్వరరావు, పట్టణ ప్రముఖులు డీవీ సోమయ్యశాస్త్రి, చిరుమామిళ్ళ కృష్ణరావు, బీవీ రాఘవయ్య చౌదరి, పరుచూరి రాఘవేంద్రరావు, కోసరాజు వెంకట్రావు పాల్గొన్నారు.

26న త్యాగరాజస్వామి 256వ జయంతి ఉత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న లోకనాథశర్మ

తెనాలి: వేమూరు మండల గ్రామం పెరవలిలో ఈ నెల 26న సద్గురు శ్రీ త్యాగరాజస్వామి 256వ జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్‌తో కలిపి పెరవలిలోని భక్తరామదాస-సద్గురు శ్రీత్యాగరాజు సంగీత మహోత్సవ సమాఖ్య నిర్వహణలో ఈ ఉత్సవాలు జరగనున్నాయి. స్థానిక గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం సమాఖ్య వ్యవస్థాపకుడు, సంగీత విద్వాంసుడు తాడేపల్లి లోకనాథశర్మ విలేకరులకు వివరాలు వెల్లడించారు. పెరవలిలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 60 మంది సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామి కృతులను గానం చేస్తారు. మృదంగం, వయొలిన్ వంటి వాద్యాల సహకారం లేకుండా కేవలం భక్తి ప్రధానంగానే ఈ సంగీత యజ్ఞం జరుగుతుందని లోకనాథశర్మ వెల్లడించారు. 11.30 గంటలకు జరిగే సభలో విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎంవీఎస్ ప్రసాద్, ఎల్వీ సుబ్రహ్మణ్యం, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మల్లాది సూరిబాబు, దూరదర్శన్ కేంద్రం, విజయవాడ ప్రోగ్రాం అధిపతి డాక్టర్ వసుమతి రాజన్, తిరుపతిలోని శ్రీత్యాగరాజస్వామి ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కేవీ మోహన సుందరం, విశాఖలోని శ్రీవాగ్దేవి కళాపీఠం వ్యవస్థాపకుడు వీవీఎల్ శ్రీనివాసమూర్తి, ప్రముఖ సినీనటి, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజుభార్గవి, వంశీ రామరాజు, సర్పంచ్ దాది వెంకట లక్ష్మీరాజ్యం పాల్గొంటారని తెలిపారు. ఇదే సభలో సద్గురు త్యాగరాజ జయంతి అవార్డు-2023ను చావలి రాధాకృష్ణమూర్తికి ప్రదానం చేయనున్నట్టు వివరించారు. మృత్యుంజయశర్మ, తాడేపల్లి ఆంజనేయశాస్త్రి, తాడేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, తాడేపల్లి శ్రీధర్, జోస్యుల శ్యామలాదేవి, టీవీఎస్ శాస్త్రి ఉన్నారు.

బసవేశ్వరస్వామి జయంతి



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో ఆదివారం బసవేశ్వర స్వామి జయంతి నిర్వహించారు. బసవేశ్వర స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ముఖ్య అతిథి బీజేఎస్ మూర్తి శివతత్వాన్ని, భక్తి మార్గాన్ని వివరించారు. ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, చుక్కా శ్రీనివాస్, భాను, గోపి సాయి, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక



తెనాలి: ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పద్మశాలీయ వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. వధువరుల పరిచయ కార్యక్రమానికి 300 దరఖాస్తులు వచ్చాయి. సభకు సొసైటీ సభ్యుడు నరసింహారావు అధ్యక్షత వహించారు. తల్లిదండ్రులతోపాటు వధువు/వరుడు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. డాక్టర్ పురుషోత్తమరావు వివాహ పరిచయ పుస్తకాలను ఆవిష్కరించారు. అక్కల శ్రీరామ్, దివి పురుషోత్తం, టీవీ కృష్ణారావు, జె.మహేష్, ఆర్.శ్రీనివాసరావు, కటకం గిరి, దామర్ల పరమేశ్వరరావు, గంజి ప్రభాకరరావు, పంచుమర్తి భాస్కర్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: జూదరులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. తెనాలి చెంచుపేట కోనేరు బజారులో పేకాట స్థావరంపై త్రీ టౌన్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఏడుగురు పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8,030లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపర్చనున్నట్టు పోలీసులు తెలిపారు.

'బీసీ గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపట్నం: నిజాంపట్నంలోని మహాత్మా జ్యోతీరావు పూలే ఏపీ బీసీ గురుకుల కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వై.నాగమల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ -60 సీట్లు, బైపీసీ-40 సీట్లు, సీఈసీ-40 సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మే 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మే 28న ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9866559636కు సంప్రదించాలని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న భాస్కరరావు, శ్రీనివాసరావు



మజ్జిగ అందజేస్తున్న కిషోర్ గురూజీ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో షరాఫ్ బజార్‌లోని మూర్తి కొండయ్య వీధిలో ఆదివారం చలివేంద్రాన్ని ఆర్యవైశ్య లీగల్ సెల్ వైస్ చైర్మన్ గొడవర్తి భాస్కరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ కుమార్, ఆర్యవైశ్య సంఘాల కో-ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం, తెనాలి పట్టణ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, నాయకులు తూనుగుంట్ల సుబ్బారావు, మల్లెపాటి తిరుమల్లేశ్వరరావు, సీవీ రమణ, చుండూరు సాయి, కోలా గురునాధ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం

తెనాలిటౌన్: అక్షయ తృతీయ సందర్భంగా శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో పలు ప్రధాన సెంటర్లలో మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. యోగ మండలి వ్యవస్థాపకుడు కిషోర్ గురూజీ చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. యోగ సభ్యులు పురుషోత్తమ కృష్ణ స్వామిజీ, సీహెచ్ నాగేశ్వరరావు స్వామిజీ వితరణతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అగస్త్యేశ్వర స్వామికి అన్నాభిషేకం



అగస్త్యేశ్వర స్వామికి అన్నాభిషేకం

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో అగస్త్య మహా ముని ప్రతిష్ఠించిన బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో వైశాఖ శుద్ధ అక్షయ తృతీయ రోహిణి నక్షత్రం సందర్భంగా స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, లక్ష మల్లెల పూజ, అమ్మవారికి శ్రీ సూక్త విధాన కుంకుమ పూజలు జరిగాయి. కాశీభొట్ల విశ్వరాయశర్మ శిష్య బృందం అర్చకులు బుద్దు సుందర శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసు ప్రారంభించిన ఎమ్మెల్యే కోన రఘుపతి దంపతులు

బాపట్ల: బాపట్ల జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేయటం ఎంతో సంతోషకరమని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఆదివారం బాపట్ల టు హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు నాన్ ఏసీ స్లీపర్ సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, ఆర్ఎం విజయకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



ఐలవరం(భట్టిప్రోలు): ద్విచక్ర వాహనంపై వెళుతున్న తండ్రి కొడుకులు రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. చికిత్స పొందుతూ కొడుకు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. ఐలవరానికి చెందిన జొన్నాదుల ఈశ్వర ప్రసాద్, అతని కుమారుడు గణేష్ శనివారం విజయవాడ బయలు దేరారు. తెనాలి వినాయకుని విగ్రహం వద్ద ఎదురుగా ఆటో అడ్డుగా రావడంతో.. వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఈశ్వర్ ప్రసాద్‌కు స్వల్ప గాయాలు కాగా గణేష్‌కు తల పైభాగం తీవ్రంగా దెబ్బతింది. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో.. గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. మధ్యాహ్నం చికిత్స పొందుతూ గణేష్ మృతి చెందాడు. గణేష్ స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు.

124 సీసాల మద్యం ధ్వంసం

తాడికొండ: తాడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను ఆదివారం సీఐ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు డీఎస్పీ వి.పోతురాజు ఆధ్వర్యంలో 124 మద్యం సీసాలు ధ్వంసం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జున పాల్గొన్నారు.

కాళికాంబ అమ్మవారి కొలుపులు ప్రారంభం



కర్లపాలెం: కర్లపాలెం గ్రామ దేవత వీరభద్ర సమేత కాళికాంబ అమ్మవారి కొలుపులు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భక్తులు అమ్మవారికి బిందెలతో అభిషేకం చేశారు. సోమవారం కుంకుమ పూజ, అమ్మవారి నగరోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుని, మొక్కులు చెల్లించుకోవడంతో కొలుపులు ముగుస్తాయి. పెద పులుగువారిపాలెంలోని వీర్లంకమ్మ బురకాయలంకమ్మ అమ్మవార్లకు బుద్దాం గ్రామంలోని పల్లాలమ్మ అమ్మవారి కొలుపులు ఘనంగా జరుగుతున్నాయి.

చర్చికి రూ.లక్ష విరాళం



నగదు చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా దంపతులు

కొల్లిపర: కొల్లిపర గ్రామం ఎస్సీ కాలనీలోని లూథరన్ చర్చి ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ చిలువూరి ఝాన్సీ, మాజీ ఎంపీటీసీ భీమవరపు సంజీవరెడ్డి, తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ జొన్నల శివారెడ్డి, రెవ పాస్టర్ సుమన్‌బాబు, సంఘ పెద్దలు కె.బాస్కరావు, ఎ.రామరావు, జి.శాంతి రాజు, మంద్రు రాజు, పిల్లి గంగాధర్, దేవ దత్తు, వైఎస్సార్ సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



మెమెంటోలు అందుకున్న విద్యార్థులతో ఫణీ

తెనాలిఅర్బన్: హైదరాబాద్‌కు చెందిన ఈ-అభ్యాస్ అకాడమి వివిధ పాఠ్యాంశాలపై గతేడాది రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ పాఠశాల విద్యార్థులు 13 మంది ప్రతిభ కనబరిచి, మెమెంటోలు అందుకున్నారని స్కూల్ ఎండీ దాసరి మురళీకాంత్ తెలిపారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం ఈ-అభ్యాస్ వ్యవస్థాపకుడు డాక్టర్ భువనగిరి ఫణికుమార్ వీటిని అందజేసినట్లు చెప్పారు. అలాగే ఒలింపియాడ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని పాఠశాలకు అందించినట్లు వెల్లడించారు.

సూర్యలంక జన సంద్రం



పోటెత్తిన భక్త జన సంద్రంతో.. సూర్యలంక సముద్రతీరం ఉప్పొంగింది. తొలిపొద్దు వెచ్చని కిరణాలతో సంతోషాలు వికసించాయి. కడలి కెరటాల స్పర్శతో తీరంలో కేరింతలు రెట్టింపయ్యాయి. రంజాన్ అనంతరం ముస్లింలతో పాటు సందర్శకులు ఆదివారం సముద్ర తీరానికి చేరుకున్నారు. తమ కుటుంబంతో స్నానమాచరించి, సంతోషంగా గడిపారు. లక్ష మందికి పైగా భక్తుల రాకతో సూర్యలంక తీరం..మరో సంద్రంగా మారింది. - బాపట్ల అర్బన్

గౌరీశంకర నాట్యమండలి రజతోత్సవం



దుర్యోధన మయసభలోని ఓ సన్నివేశం

బాపట్ల: స్థానిక సోమేశ్వర స్వామి ప్రాంగణంలో శ్రీ గౌరీ శంకర నాట్యమండలి స్థాపించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం రజతోత్సవం నిర్వహించారు. సభలో ప్రఖ్యాత రంగస్థలం నటుడు కేఎస్‌టీ సాయి మాట్లాడుతూ.. సంస్థ నిర్వాహకుడు, ప్రముఖ రంగస్థల నటుడు మల్లికార్జునరావు ప్రతి వార్షికోత్సవం సందర్భంగా ఇద్దరు ప్రముఖ రంగస్థల నటులను సన్మానిస్తున్నారని తెలిపారు. కళాకారులకు నూతన ఉత్సాహం కల్పిస్తూ.. రంగస్థల నాటకాలపై అభిరుచి కలిగిస్తుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్, నంది అవార్డు గ్రహీత డాక్టర్ పీవీ రామకుమార్, బాపట్ల రంగస్థలం పుస్తక రచయిత, రంగస్థలం కళాకారుడు మన్నే శ్రీనివాసరావును సంస్థ ఘనంగా సన్మానించింది. దుర్యోధన మయసభ, శ్రీకృష్ణ రాయబారం నాటకం నుంచి సెంట్రల్ సీను ప్రదర్శించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నిభానపూడి హరి ప్రసాద్, ఎస్వీఆర్ కుమార్, ఎస్వీఆర్ రాజేశ్వర శర్మ, బందా బాబు, నందనవనం శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com